క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



వెంకటగిరిపాళ్యంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరి పాళ్యం గ్రామంలోని పాత సచివాలయం పక్క నున్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఇనుప చువ్వలు కనిపిస్తుండటంతో ఎప్పుడు కూలుతుందో తెలీడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలమని ఏ ప్రమాదం జరగకముందే విద్యుత్ స్తంభాన్ని మార్చాలని ఆ శాఖ అధికారులను కోరుతున్నారు.

ఎంపీపీకి పరామర్శ

రొద్దం: అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతున్న ఎంపీపీ చంద్రశేఖర్‌ను మండల సర్పంచులు పరామర్శించారు. బుధవారం ఉదయం బెంగళూరుకు చేరుకున్న సర్పంచుల బృందం ఎంపీపీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచులు నాగార్జున, పరమేశ్వరయ్య, రవి, శేఖర్‌రెడ్డి, రామాంజినేయులు, రాము, సోమిరెడ్డి, ఎంపీటీసీ బాలాజీ, తిమ్మయ్య పాల్గొన్నారు.

వర్షం ధాటికి కూలిన ఇల్లు

రొద్దం: మండల కేంద్రంలోని జమాల్‌సాబ్‌కు సంబంధించిన ఇల్లు వర్షం ధాటికి కూలింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆ ఇంట్లోనే నివాసం ఉండాల్సి వస్తోందని, ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలంటూ బాధిత కుటుంబ సభ్యులు రెవెన్యూ అధికారులను కోరారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన



నీలకంఠాపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి

మడకశిరరూరల్: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఓ అడుగు ముందుకేసి బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభించిందని నీలకంఠాపురం పీహెచ్‌సీ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 60 ఏళ్లు పైబడిన వారు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకొంటే క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చాన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి గురువారం వ్యాక్సిన్ వేస్తామన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

అమరాపురం: మండలంలోని ఉదుగూరు సమీపంలో బుధవారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... అరుణ్ అమరాపురం నుంచి తన స్వగ్రామమైన కె.గొల్లహట్టికి వెళుతున్నాడు. అలాగే మంజునాథ మండలంలోని పేలుబండ గ్రామం నుంచి అమరాపురం వైపు వస్తున్నాడు. ఉదుగూరు సమీపంలో ఇద్దరి ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రొళ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామ సమీపం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ ద్వారా తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు జమేదార్ ముత్యాలన్న తెలిపారు. ట్రాక్టర్ యజమాని శ్రీనివాస్‌రెడ్డి, డ్రైవర్ తిప్పేస్వామిపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మురుగు కాలువపై బండలు



బండలతో కాలువను మూసిన దృశ్యం

పావగడ: పట్టణంలోని 4వ వార్డుకు చెందిన తాలూకా కార్యాలయం పక్కన ఉన్న ప్రధాన మురుగు కాలువపై మూతలేకపోవడంపై సాక్షి దినపత్రికలో ఈ నెల 15న 'ఆదమరిస్తే ముప్పే' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్థానిక 4వ వార్డు కౌన్సిలర్ సుదేశ్ బాబు, మున్సిపల్ ముఖ్యాధికారి షంషు స్పందించారు. బుధవారం తాత్కాలికంగా బండలు వేయించి కాలువను మూయించారు.

జూన్ 4 తర్వాత టీడీపీ గల్లంతే



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం
- పెనుకొండలో భారీ మెజార్టీతో గెలుస్తాం
- మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: 'సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలుస్తుందని టీడీపీ నాయకులు భ్రమల్లో ఉన్నారు. జూన్ 4వ తేదీ తర్వాత రాష్ట్రంలో టీడీపీ అడ్రస్ గల్లంతవుతు కావడం ఖాయం'. అని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖా మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని గోల్డెన్ ఎంపైర్ ఫంక్షన్‌హాల్లో బుధవారం మంత్రి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు నాలుగు సర్వేలు చేపట్టగా అన్ని సర్వేల్లో వైఎస్సార్‌సీపీనే ముందుందని పేర్కొన్నారు. పట్టణంలో 6 బూత్‌లతో రూరల్‌లో 4 బూత్‌లలో మాత్రమే వెనుకంజలో ఉన్నామని ఇంటలిజెన్స్ నివేదికలు తెలియజేస్తున్నాయని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. పోలింగ్ రోజు మహిళలు క్యూలో నిలబడి ఓటు వేయడమే దానికి నిదర్శనమన్నారు. సంక్షేమాభివృద్ధిని నమ్మి మహిళలు ఓటేస్తే టీడీపీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారనడం వారి రాజకీయ అజ్ఞానమవుతుందన్నారు. పోలింగ్ అనంతరం ఇంటలిజెన్స్ వర్గాలు ప్రధాని మోదీ వద్దకు వెళ్లి ఏపీలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాబోతోందని చెప్పగా.. ఆయన ఎలా చెబుతున్నారని ప్రశ్నించారని తెలిపారు. అక్కడ ఉన్న ఇంటలిజెన్స్ ప్రతినిధి జగనన్నకు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్, పార్టీ కేడర్ దేశంలోనే ఎవరికీ లేదని వివరించినట్లు మంత్రి తెలియజేశారు. ఇంకా ఫలితాలు తేలక మునుపే టీడీపీ నాయకులు సంబరాల్లో మునిగిపోయారని, పదవులను, డీలర్‌షిప్‌లను, ఫీల్డ్ అసిస్టెంట్‌లను, యానిమేటర్‌లు తదితర వాటిని పంచుకునే పనిలో నిమగ్నమయ్యారన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇది టీడీపీ అల్ప సంతోషానికి నిదర్శనమన్నారు.

అందరికీ రుణపడి ఉంటా

తన గెలుపు కోసం ఎన్నికల్లో ఎవరు కష్టపడ్డారో తనకు తెలుసని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. టిఫిన్, భోజనం లేకుండా ఓటర్లను తరలించడంలో ఎంతో పాటుపడ్డారని కొనియాడారు. పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ముందుకు వెళ్లాలని, ఎక్కడా పార్టీని, తనను కించపరిచేలా మాట్లాడవద్దన్నారు. జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమని, తాను పెనుకొండలో ఎమ్మెల్యే కావడం తథ్యమని పేర్కొన్నారు. టీడీపీ నాయకుల ఇళ్లలో ఉన్న మహిళలు సైతం ఫ్యాన్‌కే ఓటు వేసారన్నారు. ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమననారు. ప్రతి పథకం తమ ఇంటి వద్దకే వచ్చిందన్న నమ్మకం ప్రజల్లో నెలకొందన్నారు. ఠంచనుగా పింఛన్ తీసుకుంటున్నామన్న ఆనందం పోలింగ్ రోజున వృద్ధులు, వికలాంగుల ముఖాల్లో స్పష్టంగా కనబడిందన్నారు. పెనుకొండలో 2,34,934 ఓట్లు ఉండగా 2,05,034 ఓట్లు పోలయ్యాయని, మన గెలుపు తథ్యమన్నారు. ఎన్నికలో తన గెలుపునకు నిజాయతీతో పని చేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని, అదే స్ఫూర్తితో ప్రతి నాయకుడు, కార్యకర్తకు తోడుగా ఉంటామని మంత్రి స్పష్టం చేశారు.

పవన్‌కళ్యాణ్‌కు ఓటమి తప్పదు

జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌పై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత గెలవబోతున్నారని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. కేంద్రంలో మోదీ పరిస్థితి సైతం ఇబ్బందికరంగా మారిందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీకి జగనన్న ఎంతో సాయం చేశారని, అయితే ఎన్నికల్లో జగనన్నకు మోదీ అన్యాయం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పెనుకొండ నగర పంచాయతీలోని వెంకటరెడ్డిపల్లిలో ఓ టీచర్ నాలుగు దొంగ ఓట్లు వేశాడని, టీడీపీ నాయకులు సమూహంగా దౌర్జన్యంగా దొంగ ఓట్లు వేసినా పోలీసులు నోరు విప్పలేదన్నారు. కొందరు ఉద్యోగులు కూటమి అభ్యర్థులతో కుమ్మక్కై వైఎస్సార్‌సీపీని ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించారన్నారు. సమావేశంలో వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, సర్పంచులు నాగమూర్తి, నాగరాజు, అశ్వర్థప్ప, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు నాగలూరు బాబు, బోయ నరసింహ, కౌన్సిలర్లు సుధాకరరెడ్డి, సద్దాం, రఘునాథరెడ్డి, భాస్కర్‌నాయక్, రామాంజినేయులు, జయశంకరరెడ్డి, గణేష్, నేమతుల్లా, గుట్టూరు ఆంజనేయులు, నటేష్, గోపాలరెడ్డి, నారాయణ, తిరుపాల్‌నాయక్, వెంకటరెడ్డి, కిష్టప్ప, చినపరెడ్డి రాము, ప్రసాద్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్లలో...

గోరంట్ల: స్థానిక రంగమహల్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మంత్రి ఉషశ్రీచరణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలోని పోలింగ్ బూత్‌ల వారీగా పార్టీ విజయావకాశాలపై ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్, ముఖ్యనాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

మడకశిర: హిందూపురం సమీపంలోని బిట్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో మడకశిర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచారు. ఈనేపథ్యంలో ఈరలక్కప్ప బుధవారం ఈ కళాశాలను సందర్శించి స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతపై ఆరా తీశారు. అనంతరం ఆయన ఈవీఎంల భద్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఒక్కటైన ప్రేమ జంట



చక్రవర్తి మెడలో పూలదండ వేస్తున్న సంధ్య

గుడిబండ: మండల పరిధిలోని మోపురుగుండు గ్రామానికి చెందిన కమ్మరి తిమ్మరాయప్ప కుమారుడు చక్రవర్తి , సంధ్య ఇద్దరూ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే ఇరువురు కుటుంబ సభ్యులు వారి పెళ్లికి ఒప్పుకోకపోవడంతో వారు గ్రామ పెద్దలను ఆశ్రయించారు. ఈ క్రమంలో బుధవారం పట్టణ సమీపంలోని తుమ్మల మారెమ్మ ఆలయంలో వారు ప్రేమ వివాహం చేసుకున్నారు. ఒక్కటైన ప్రేమ జంటను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, సర్పంచ్ కరుణాకర్‌గౌడు వధూవరులను ఆశీర్వదించారు.

మావటూరులో కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరులో బుధవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ యుగంధర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా రికార్డులు లేని పది ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఎస్‌ఐ రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: మండలంలోని చౌళూరులో బుధవారం సీఐ వై. శ్రీనివాసులు, సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామాల్లో అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్తల్లో భాగంగా చౌళూరులో తనిఖీలు చేపట్టామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం: పట్టణ సబ్ డివిజన్ ముదిరెడ్డిపల్లి సెక్షన్ మనేసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని మనేసముద్రం, మలుగురు, గొల్లపల్లి, ఊటుకూరు గ్రామాల్లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ మహేష్ కుమార్ తెలిపారు. వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించాలన్నారు.

మెరిట్ ఆధారంగా ఇంటర్ అడ్మిషన్లు

చిలమత్తూరు: మెరిట్ ఆధారంగా ఇంటర్ అడ్మిషన్లు నిర్వహిస్తామనిటేకులోడు క్రాస్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌భూపాల్‌రెడ్డి తెలిపారు. ఎంజేపీ ఎంట్రెన్స్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారు ఈ నెల 30లోపు అడ్మిషన్ పొందాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అగళి: ఎన్నికల నియమావళి అమలు ఉన్నందున్న మండలంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని మడకశిర రూరల్ సీఐ రాజుకుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆయన సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 24 మందిని ముందుజాగ్రత్తగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఎదుట బైండోవర్ చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వీరేష్, పోలిస్ సిబ్బంది పాల్గొన్నారు.

రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రొళ్ల: మండల పరిధిలోని కాల్వేపల్లి లో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత స్వామివారి మూల విగ్రహాన్ని గంగాజలంతో శుద్ధి చేసి అభిషేకించారు. అనంతరం భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరించి మహామంగళహారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితులు గణపతి పూజ, స్వస్తివాచన, పుణ్యాహ, రక్షబంధన, కలష స్థాపన, అంకురార్పణ, ధ్వజారోహణతో పాటు రాత్రి లక్ష్మీదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు జరుగుతుండడంతో స్వామివారిని కొలిచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



అలంకరణలో రంగనాథస్వామి

నేడు బ్రహ్మరథోత్సవం

రంగనాథస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే 24న వసంతోత్సవం, 101 ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

లక్ష్మీనిడిమామిడమ్మ ఊరేగింపు



మడకశిరరూరల్: మండల పరిధిలోని జమ్మానిపల్లిలో వెలసిన లక్ష్మీనిడిమామిడమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన రోజు కావడంతో బుధవారం సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఉదయం నుంచే ఆలయంలో హోమం, వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి వీధుల కుండా ఊరేగించారు.

మడకశిరలో కల్యాణోత్సవం

మడకశిర: పట్టణంలోని లక్ష్మీవేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. లక్ష్మీ వేంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు



ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడితో పోలీసులు

హిందూపురం అర్బన్: లేపాక్షిలోని రాజీవ్ కాలనీకి చెందిన ఉదయ్‌కుమార్ (16) కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెందాడు. ఆత్మహత్య చేసుకునేందుకు పట్టణంలోని రహమత్‌పూర్ సమీపంలోని రైల్వేట్రాక్ వద్దకు చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో డయల్ 100కు సమాచారం రావడంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో రహమత్‌పూర్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఉదయ్‌కుమార్‌ను గుర్తించి అతని ప్రాణాలు కాపాడారు. అనంతరం వారి కుటుంబీకులకు అతన్ని అప్పగించారు.

అక్రమ కట్టడాల తొలగింపు



జేసీబీతో పునాదిని నేలమట్టం చేస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలోని జగనన్న లేఅవుట్‌లో అక్రమ కట్టడాలను నగర పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు తొలగించారు. ఇటీవల జగనన్న లేఅవుట్‌లో దాదాపు పది మందిదాకా తొలుత పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారు. అయితే అనంతరం వాటిని రద్దు చేశారు. విషయం తెలియకుండా పొజిషన్ సర్టిఫికెట్లు పొందిన వారు పునాదులు వేసుకున్నారు. దీంతో నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, తహసీల్దార్ ఉదయ శంకరరాజు సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీతో పునాదులను తొలగించారు. అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంత్రి వద్దకు బాధితులు

తమ ఇంటి నిర్మాణానికి సంబంధించి పునాదులను జేసీబీతో కొట్టి వేసిన విషయాన్ని బాధితులు మంత్రి ఉషశ్రీచరణ్ దృష్టికి తీసుకెళ్లారు. తమకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడంతోనే పునాదులు కట్టుకున్నట్లు వివరించారు. నేడోరేపో రెవెన్యూ అధికారులను కలసి ఈ విషయంపై ఆరా తీస్తానని మంత్రి వారికి తెలియజేశారు. కాగా ఓ ఆర్‌ఐ మరో వీఆర్‌ఓ, ప్రైవేట్ వ్యక్తులు కలసి పేదల వద్ద డబ్బులు దండుకుని పేదలను ఇబ్బందుల పాలు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైభవంగా కల్యాణోత్సవం



ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అమరాపురం: మండల పరిధిలోని పేలుబండ గ్రామంలో కొండలో వెలసిన లక్ష్మీ రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం లక్ష్మీ సమేత రంగనాథస్వామికి వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహన్ని ప్రత్యేకంగా అలంకరించి కొండ చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో పేలుబండ గ్రామస్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా నృసింహ జయంతి

పావగడ: స్థానిక కణివె లక్ష్మీనరసింహస్వామి జయంతిని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మంటపంలో నరసింహ హోమం నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ సమితి గౌరవాధ్యక్షుడు జ్ఞానేశ్ బాబు, కార్యాధ్యక్షుడు మాధవన్, కార్యదర్శి శ్రీకృష్ణ, ట్రెజరర్ నరసింహనాయక, డైరెక్టర్లు సుబ్బనరసింహ, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు నిర్వహించారు.ఆ లయంలో పురోహితులు హోమం, స్వామి వార్ల కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. వివిధ గ్రామాల్లోనే నృసింహ జయంతిని నిర్వహించారు.

హిందూపురం: పట్టణంలోని నింకంపల్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్వామివారికి విశేష పూజలు చేశారు. శ్రీదేవి భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. శ్రీవారి జయంతి సందర్భంగా ఆలయంలో హోమాలు చేశారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున దీపోత్సవం నిర్వహించారు. మహిళలు జ్యోతులను ఆలయంలో సమర్పించారు. సాయంత్రం నగరోత్సవం నిర్వహించారు.

పెనుకొండ: పట్టణంలోని నరసింహస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసింహస్వామి జయంతిని పురస్కరించుకుని స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించారు.



హిందూపురం: అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



పెనుకొండ: అలంకరణలో నరసింహస్వామి



భక్తరహళ్లిలో కల్యాణోత్సవం నిర్వహించిన దృశ్యం



నింకంపల్లిలో జ్యోతులు మోస్తున్న మహిళలు



పావగడ: నరసింహ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

17 మంది బైండోవర్

రొళ్ల: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లు, అలజడులు సృష్టించ కుండా ముందు జాగ్రత్త చర్యగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 17 మందిని తహసీల్దార్ భద్రుజమ ఎదుట బైండోవర్ చేసినట్లు జమేదార్ ముత్యాలన్న తెలిపారు. అనంతరం స్వంత పూచికత్తుపై వారిని విడుదల చేశామన్నారు.